క్లుప్తంగా

నేడు మండల ప్రత్యేక సమావేశం

సామర్లకోట: మండల పరిషత్ ప్రత్యేక సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ డి.శ్రీలలిత గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఖాళీగా ఉన్న మండల ఉపాధ్యక్ష–1 ఎన్నికలకు సంబంధించి ఈ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల ఉపాధ్యక్షురాలిగా పని చేసిన మలిరెడ్డి సూర్యావతి మృతితో ఈ పదవి ఖాళీగా ఉందన్నారు. ఎంపీటీసీల నిర్ణయం మేరకు ఎన్నిక ఉంటుందని చెప్పారు. మండల పరిధిలోని ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలన్నారు.

వైభవంగా కుంతీమాధవ స్వామి గ్రామోత్సవం



గరుడ వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న పండితులు

పిఠాపురం: స్థానిక కుంతీమాధవ స్వామివారి క్షేత్రంలో వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం శేష, గరుడ వాహనాలపై స్వామికి గ్రామోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శనివారం స్వామివారి రథోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. ఇందులో భక్తులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో భజన పోటీలు



వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం మండల స్థాయి భజన పోటీలు జరిగాయి. స్వామి వారి కల్యాణోత్సవాలను పురస్కరించుకు నిర్వహిస్తున్న ఈ పోటీలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయిలో జరుగుతాయని తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా పెండ్యాల నాగేశ్వరరావు, గుణ్ణం శారదాదేవి, అమలకంటి చంటిబాబు వ్యవహరిస్తున్నారు. ఐదో తేదీన విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు తెలిపారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ సుభద్ర

పెద్దాపురం: స్థానిక సాగర్ మున్సిపల్ పాఠశాలను గురువారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి సుభద్ర తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విద్యా బోధన అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం, హాజరు శాతాన్ని ఆమె పరిశీలించారు.

పోలీసుల అదుపులో అనుమానిత వ్యక్తి

కొత్తపల్లి: కొమరగిరి శివారు ఆనంద్‌నగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ గ్రామంలో ఉదయం నుంచి వీధుల్లో తిరుగుతూ చిన్న పిల్లల దగ్గరకు వెళ్లడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో అతనిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు. హిందీలో మాట్లాడుతున్న అతని వివరాలు సేకరిస్తున్నట్లు వివరించారు.

నవోదయ అడ్మిట్ కార్డుల విడుదల

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షకు అడ్మిట్ కార్డులు విడుదల చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ 2023–24 విద్యా సంవత్సరానికి ఈ నెల 11న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్, విద్యానిధి ఇంగ్లిష్ మీడియం స్కూల్, జవహర్ నవోదయలో మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నామని, విద్యార్థులకు అడ్మిట్ కార్డులను నవోదయ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. నిర్ణీత సమయానికి 30 నిమిషాల ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. వివరాలకు 94418 29056, 98497 78512 నెంబర్లను సంప్రదించాలన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు సమాయత్తం

- సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యం
- గోదావరి కలుషిత జలాల నియంత్రణ
- వివిధ శాఖల అధికారులతో ఆర్డీఓ సమీక్ష



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు, ట్రస్టు బోర్డు సభ్యులు

సామర్లకోట: మహాశివరాత్రి సందర్భంగా భక్తుల వసతులకు, గోదావరిలో కలుషిత జలాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్డీఓ బి.వెంకటరమణ తెలిపారు. పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణం, మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. భక్త సంఘ నాయకులు బిక్కిన సాయి, రాజశేఖర్, నూతలపాటి అప్పలకొండ, బీజేపీ నాయకుడు సుంకవిల్లి బాపిరాజు, కౌన్సిలర్ నేతల హరిబాబు వివిధ సమస్యలపై ఆయనకు వివరించారు. దీంతో ఆర్డీఓ నీటి పారుదల, కాలుష్య నివారణ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇస్తామని చెప్పారు. క్యూలైన్ల ఏర్పాటుపై దేవదాయశాఖ అధికారులకు ఆదేశాలిస్తామని అన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఆరోగ్య విభాగం అధికారులు హాజరుకాకపోవడంతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని అన్నారు.

భక్తులకు అన్నదానం, వాటర్ ప్యాకెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు పారిశ్రామిక వేత్త కర్రి వెంకట్రాజు తెలిపారు. వాసవీ యూత్, ఫ్రెండ్ అసోసియేషన్ నుంచి ఏటా సుమారు 20వేల మందికి భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. లయన్స్ క్లబ్ నుంచి పాలు, మజ్జిగ, రొట్టెలు, మాజీ ఎంపీపీ కొండపల్లి బ్రదర్స్ పాలు, మజ్జిగ, ఉప్పువారి సత్రం నుంచి మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు. వివిధ శాఖల సమన్వయంతో ఉత్సవాలు అంతరాయం లేకుండా నిర్వహించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల రాజప్ప సూచించారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, సభ్యులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. పురావస్తుశాఖ ఆధ్వర్యంలో రూ.కోటితో అభివృద్ధి పనులు చేస్తున్నారు. ప్రధాన, ఉప ఆలయాల పైకప్పు మరమ్మతులతో పాటు ఫ్లోరింగ్, కోనేటిలో పూడిక తీస్తున్నట్లు పురావస్తుశాఖ అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.

16 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

సామర్లకోట: ఈ నెల 16 నుంచి 21 వరకు పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 16న ఉదయం విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, దీక్షాధారణ, మధ్యాహ్నం గ్రామోత్సవం, రాత్రికి కల్యాణం జరుగుతాయని తెలిపారు. 17న ఉదయం అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, 18న మహాశివరాత్రి తెల్లవారు జాము నుంచి భక్తులకు దర్శనం, 19న స్థానిక గాంధీచౌక్ నుంచి రథోత్సవం, 20న ఉదయం త్రిశూల స్నానం, తీర్థపు సేవ, 21న శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

రేపు బాబా విగ్రహ ప్రతిష్ఠ

సామర్లకోట: స్థానిక కొత్తూరు రోడ్డులోని తాండ్ర పాపారాయుడు విగ్రహం వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం షిర్డి సాయిబాబా, దత్తాత్రేయ, వినాయకస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో పాటు ఎమ్మెల్యే రాజప్ప ఇతర రాజకీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

సంపద కేంద్రాలతో ఆదాయం



గోర్సలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

కొత్తపల్లి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని ఎంపీడీఓ భాస్కరరావు అన్నారు. కొమరగిరి, గోర్సలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ముఖ్యంగా కొమరగిరి, కొత్తపల్లి, వాకతిప్పతో పాటు పలు కేంద్రాలలో ఎరువును తయారు చేసి గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచుతామని అన్నారు. గ్రామాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్‌లకు ప్రజలు సహకరించాలని కోరారు. ఫీల్డ్ టెక్నికల్ కోఆర్డినేటర్ రామకృష్ణ, గోర్స పంచాయతీ కార్యదర్శి పి.లక్ష్మీదేవి ఉన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ



హెల్మెట్‌లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పిఠాపురం: హెల్మెట్ ధరించండి.. ప్రాణ రక్షణ పొందండి అంటూ పిఠాపురంలో పోలీసులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో గొల్లప్రోలు నుంచి పిఠాపురం వరకూ పోలీసులు హెల్మెట్‌లు ధరించి బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రయాణికులకు వివరించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ హెల్మెట్ ధర కంటే ప్రాణం విలువ ఎక్కువన్నారు. గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది హెల్మెట్‌లు లేక తలకు బలమైన గాయాలై ప్రాణాలు కోల్పోయారన్నారు. అందుకే ద్విచక్ర వాహన దారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల 90 శాతం ప్రాణ రక్షణ కలుగుతుందని వివరించారు.

ట్రాక్టర్–వ్యాన్ ఢీ : ట్రాఫిక్‌కు అంతరాయం



వీకే రాయపురం వద్ద రహదారికి అడ్డంగా నిలిచిపోయిన ట్రాక్టర్, వ్యాన్

సామర్లకోట: కాకినాడ కెనాల్ రోడ్డులో గురువారం వీకే రాయపురం వద్ద ట్రాక్టరు, వ్యాను గురువారం ఢీ కొన్నాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి వీకే రాయపురం నుంచి మాధవపట్నం వరకు వాహనాలు నిలిచిపోయాయి. దాంతో మాధవపట్నం రైల్వే గేటు మీదుగా వాహనాలను మళ్లించారు. అదే విధంగా సామర్లకోట నుంచి వీకే రాయపురం మీదుగా కాకినాడ వెళ్లే వాహనాలను అచ్చంపేట ఏడీబీ రోడ్డు మీదుగా మళ్లించారు. ఇంద్రపాలెం పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పారదర్శకంగా రీ సర్వే

కార్పొరేషన్ కమిషనర్ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ రమేష్

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కింద చేపట్టిన భూముల రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ కోరారు. స్మార్ట్ సిటీ కార్యాలయంలో గురువారం అడ్మిన్ సెక్రటరీలు, ప్లానింగ్ కార్యదర్శులు, రెవెన్యూ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీడీఎంఏ నుంచి 16ఏ ఫార్మెట్‌లో వచ్చిన ఆదేశాల అమలుపై సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగా ఆయా అసెస్మెంట్ నంబర్లు, ఇతర సమాచారాన్ని సర్వే నంబర్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియను 15 రోజుల వ్యవధిలో పూర్తి చేసేలా సిబ్బంది, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీసర్వే వల్ల ఎన్నో భూ వివాదాలకు, సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఏసీపీ నాగ శాస్త్రులు, టౌన్ సర్వేయర్ ఆచారి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత సత్యలింగ నాయకర్



మల్లాడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాదరాజు తదితరులు

- నన్నయ వీసీ ప్రసాదరాజు

కాకినాడ రూరల్: విద్యాభివృద్ధి కోసం విలువైన భూములను కేటాయించడంతో పాటు ఎంఎస్‌ఎన్ చారిటీస్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన మల్లాడి సత్యలింగ నాయకర్ స్ఫూర్తి ప్రదాత అని నన్నయ వర్సిటీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. నాయకర్ వర్ధంతిని అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్‌ఎన్ పీజీ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసాదరాజు ప్రిన్సిపాల్ కమలకుమారి, చారిటీస్ చైర్మన్ కార్తీక్ నాయకర్, మల్లాడి చంద్రకుమారి తదితరులతో కలసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ ఎంఎస్‌ఎన్ పీజీ సెంటర్‌లో చదవడం పూర్వ జన్మ సుకృతమన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ విద్యాభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. అంతకు ముందు వీసీకి విద్యార్థులు, సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు.

బుజ్జాయిలకు బొమ్మలతో బోధన

- నూతన విద్యా విధానానికి శ్రీకారం చుట్టిన వైఎస్సార్ ప్రీ ప్రైమరీ పాఠశాలలు



అంగన్‌వాడీ సెంటర్‌లో బొమ్మలతో విద్యాబోధనందిస్తున్న టీచర్

పెద్దాపురం: బుజ్జాయిలు బుడతలై.. ఆనక బుద్ధిమంతులై అటు పిమ్మట ప్రయోజకులై ఉత్తమ సమాజ నిర్మాణానికి భాగస్వాములయ్యేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమై ఉండాలి. ఇదిగో అదే లక్ష్యంతో చిన్నారులను ప్రోత్సహిస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. పలకలు, పుస్తకాల మోత లేకుండా దృశ్య, శ్రవణ విధానాలతో బొమ్మలతో అంగన్‌వాడీ కేంద్రాలన్నీ వైఎస్సార్ ప్రీ ప్రైమరీ ఇంగ్లిషు మీడియం స్కూళ్లుగా మారి నూతన విద్యా బోధనతో బుజ్జాయిలకు మంచి పునాది వేస్తున్నారు.

నియోజకవర్గంలో 579 ప్రీ ప్రైమరీ స్కూళ్లు..

నియోజవకర్గంలోని పెద్దాపురం, సామర్లకోట అర్బన్, రూరల్ ప్రాజెక్టుల్లో సుమారు 579 అంగన్‌వాడీ కేంద్రాలు వైఎస్సార్ ప్రీ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటయ్యాయి. సామర్లకోట రూరల్‌లో 303, అర్బన్‌లో 70, పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలో 206 సెంటర్లలో ప్రీ ప్రైమరీ స్కూళ్ల ద్వారా విద్యా బోధన చేస్తున్నారు. పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలో 4283, సామర్లకోట అర్బన్ ప్రాజెక్టులో 1688, రూరల్ ప్రాజెక్టులో 4519 మంది వెరసి 10,489 మంది చిన్నారులకు విద్యాబోధన చేస్తున్నారు.

ఒత్తిడి లేని విద్యకు శ్రీకారం



వైఎస్సార్ ప్రీ ప్రైమరీ ఆంగ్ల మాధ్యమం స్కూళ్లకు వచ్చే చిన్నారులకు ఒత్తిడి లేకుండా బొమ్మలతో ఆడుకుంటూ చదవుకునే విధానానికి శ్రీకారం చుట్టారు. బొమ్మలు, చార్టులతో ఆట వస్తువులతో విద్యా బోధన అందిస్తున్నారు.

– ఎ.చంద్రకళ, సూపర్‌వైజర్, దివిలి సెక్టార్

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుదీప్తి

పెద్దాపురం: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టా రీత్యా నేరమని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని స్థానిక ఏరియా ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యులు ఎన్.సుదీప్తి అన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై గురువారం అవగాహన కల్పించారు. సుదీప్తి మాట్లాడుతూ బాలికలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొత్తగా స్కాన్ సెంటర్లు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా జిల్లా వైద్యాధికారి అనుమతి పొందాలన్నారు. స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ సమాచారాన్ని చట్ట ప్రకారం బహిర్గతం చేయకూడదన్నారు. దీనిని అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. అనంతరం కిశోర బాలికలకు గర్భ నిర్ధారణపై అవగాహన కల్పించారు. లీగల్ అడ్వైజర్ రవికుమార్, కందుల వెంకటాచలం, వైద్యులు సత్యవాణి, మౌనిక, ఎన్‌జీఓ పల్లా వాసవి తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే కొంగు బంగారమై..

- మత సామరస్యానికి చిహ్నం బషీర్ బీబీ
- పొన్నాడలో బంగారు పాపమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు
- ఈ నెల 10 నుంచి ప్రారంభం



పొన్నాడలో బషీర్ బీబీ దేవాలయం



దేవాలయంలో భక్తులు (ఫైల్)

కొత్తపల్లి: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమై హిందూ, ముస్లింల సమైఖ్యతకు చిహ్నంగా చెప్పబడే బషీర్ బీబీ ఉర్స్ ఉత్సవాలకు రాష్ట్రంలోనే పేరుంది. పొన్నాడలో ఈ నెల 10 నుంచి జరిగే ఉత్సవాలకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలి రానున్నారు. భక్తులు మూడు రోజుల పాటు దర్గా ప్రాంగణంలోనే ఉండి ఉత్సవాలు ముగిసిన తరువాత వెళుతుండడం ఆనవాయితీ. కొత్తపల్లి మండలం పొన్నాడలో వేంచేసియున్న బషీర్ బీబీ ఔలియా (బంగారు పాపమ్మ) దర్గా ఉంది. ముస్లింలే కాకుండా హిందువులు, క్రైస్తవులతో పాటు అంతా ఈ ఉత్సవాల్లో పాల్గొవడం విశేషం. ముస్లింల దేవతైన బషీర్ బీబీని స్థానికంగా బంగారు పాపమ్మ అని పిలుస్తుంటారు. పూర్వం బషీర్ బీబీ ఏడు అంతస్తుల భవనంలో ఉండేవారని, తన బంగారాన్ని పేదలు శుభకార్యాలు నిర్వహించేటప్పుడు అప్పుగా ఇచ్చేవారని శుభకార్యం పూర్తయిన వెంటనే తిరిగి ఆ బంగారాన్ని ఆమెకు ఇచ్చేసే వారని స్థానికులు చెబుతుంటారు. ఈ విధంగా బంగారం తీసుకున్న స్థానికులు ఒకసారి తిరిగి ఇవ్వకపోవడంతో అప్పటి నుంచి ఆమె బంగారం ఇవ్వడం మానేసిందని కథ ప్రాచుర్యంలో ఉంది. పేదలకు బంగారం అప్పుగా ఇవ్వడం వల్ల ఆమెకు బంగారు పాపమ్మ అనే పేరు సార్థకమైందని చెబుతుంటారు. ప్రస్తుతం పొన్నాడలో ఉన్న బషీర్‌బీబీ ఆలయం గతంలో ఏడు అంతస్తులు ఉండేదని, రానురాను ఆరు అంతస్తులు భూమిలోకి కూరుకుపోగా పైఅంతస్తు మాత్రమే దర్శనమిస్తుందని అంటుంటారు. బషీర్‌బీబీని దర్శించుకుంటే సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. అందుకే భక్తులు మూడు రోజుల పాటు ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని బషీర్ బీబీని దర్శించుకుంటారు. ఈ మూడు రోజులూ తీర్థం నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో ముజావర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

భారీ బందోబస్తు

బషీర్ బీబీ ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తుల వాహనాలు వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని కల్పిస్తున్నారు. చివరి రోజైన 12న భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది.

68వ ఉర్స్ ఉత్సవాలు

ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకూ 68వ ఉర్స్ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 12వ తేదీన గంధోత్సవం నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. మూలపేటకు చెందిన షేక్ మౌలాసాహెబ్ ఇంటి నుంచి గంధాన్ని 12వ తేదీ మధ్యాహ్నం నుంచి నౌభత్‌ఖానా, బ్యాండ్ మేళాలతో గుర్రంపై ఊరేగింపుగా తీసుకొస్తారు. ఆ గంధాన్ని బషీర్ బీబీకి పూసిన అనంతరం భక్తులకు పంచి పెడతారు. మూడు రోజుల పాటు ఆలయంలో ఖురాన్‌ఖానీ, వాజ్, మిలాద్, షరీఫ్ తదితర పూజలు నిర్వహిస్తారు.

సంపత్ సాయి ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధనలో భక్తులు

పెద్దాపురం: మండలంలోని పులిమేరు సంపత్ సాయిబాబా సహిత అపర్ణాదేవి సత్యనారాయణ స్వామి ఆలయ మూడో వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతలు బండారు నాగబాబు, శ్వేత దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా సంకీర్తనలు ఆలపించారు.

కొమరగిరిలో ఏకాహం



ప్రసన్నాంజనేయ స్వామి

కొత్తపల్లి: కొమరగిరిలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద భీష్మ ఏకాదశి సందర్భంగా గురువారం ఉదయం వరకూ ఏకాహం నిర్వహించారు. కొమరగిరి నుంచే కాకుండా పండూరు, గోర్స, నేమాం తదితర గ్రామాల నుంచి భజనా సమాజ భక్తులు విచ్చేసి సంకీర్తలను ఆలపించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అపెక్స్ కార్మికుల ఆందోళన



కార్మికులతో చర్చిస్తున్న సీఐ, ఎస్సై

పెద్దాపురం: స్థానిక వడ్లమూరు రోడ్డులోని అపెక్స్ రొయ్యల పరిశ్రమ వద్ద గురువారం సాయంత్రం కార్మికులు ఆందోళన చేపట్టారు. పరిశ్రమ యాజమాన్యం తమకు చెల్లించాల్సిన బోనస్ ఇవ్వలేదంటూ బైఠాయించారు. ఆందోళన ఉధృతం కావడంతో సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలానికి చేరుకుని కార్మికులతో చర్చించారు. యాజమాన్యం, కార్మికుల చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: విద్యుత్ స్తంభాల మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జి.ప్రసాద్ గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రామారావుపేట, ప్రకాశం వీధి, టౌన్ రైల్వేస్టేషన్ ఏరియా, శేషసాయివీధి, వెటర్నరీ హాస్పటల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

కరప: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీ జి.ప్రసాద్ తెలిపారు. కరపలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ విద్యుత్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్నామని, దీంతో కరప, పేపకాయలపాలెం, పెనుగుదురు గ్రామాల్లో నిర్దేశించిన సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సానా ఈశ్వరప్రసాద్ తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న అదనపు కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. 9వ డివిజన్‌లోని లక్ష్మీనగర్, గుడారిగుంట, రాజారామ్మోహన్‌రాయ్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో పర్యటించి చెత్త సేకరణను పరిశీలించారు. రెడ్‌క్రాస్ ప్రాంతంలోని డ్రైనేజీల్లో పూడిక తొలగించాలని సూచించారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సచివాలయ కార్యదర్శులు అవగాహన కల్పించాలని సూచించారు. శానిటరీ సూపర్‌వైజర్ జిలాని, ఇన్‌స్పెక్టర్ వర్మ, సచివాలయ ఉద్యోగులు ఉన్నాయి.